క్లుప్తంగా

నగ్నేశ్వర, బాలా త్రిపురసుందరి కల్యాణం నేడు



శ్రీ నగ్నేశ్వర, బాలా త్రిపురసుందరి దేవి

రాంబిల్లి : దిమిలిలో చారిత్రక నగ్నేశ్వరస్వామి ఆలయంలో శనివారం రాత్రి శ్రీ నగ్నేశ్వరస్వామి, బాలా త్రిపురసుందరి దేవి అమ్మవారి కల్యాణం జరగనుంది. కల్యాణ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు ఆలయ అర్చకులు మారుతీ శర్మ శుక్రవారం తెలిపారు. భక్తులు ఈ కల్యాణాన్ని తిలకించి, తీర్థప్రసాదాలు స్వీకరించాల్సిందిగా ఆయన కోరారు.

విజ్ఞాన శిబిరాలతో చదువుపై ఆసక్తి



కోటవురట్ల శాఖా గ్రంథాలయంలో చిత్ర లేఖనం చార్టులతో విద్యార్థులు

కోటవురట్ల : వేసవి విజ్ఞాన శిబిరాలు విద్యార్థులకు చదువు పట్ల ఆసక్తిని పెంచుతున్నాయని గ్రంథాలయాధికారి అప్పలనాయుడు అన్నారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో శుక్రవారం వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా విద్యార్థులతో పుస్తక పఠనం, నీతి కథలు చెప్పడంలో సాధన చేయించారు. చిత్ర లేఖనం పోటీ నిర్వహించగా విద్యార్థులు తమ ప్రతిభను ప్రదర్శించారు.


శాస్త్రీయ నృత్యాలపై విద్యార్థులకు అవగాహన



నృత్య సాధన చేస్తున్న చిన్నారులు

అచ్యుతాపురం(అనకాపల్లి) : అచ్యుతాపురం శాఖా గ్రంథాలయంలో శుక్రవారం విద్యార్థులకు భరతనాట్యం, శాస్త్రీయ నృత్యాల గురించి అవగాహన కల్పించారు. వేసవి శిక్షణా శిబిరాల్లో భాగంగా 26వ రోజు నిర్వహించిన ఈ కార్యక్రమానికి రిసోర్స్ పర్సన్‌గా లక్ష్మణరావు వ్యవహరించారు. గ్రంథాలయాధికారి కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు వేంపాడులో రామానుజుల విగ్రహావిష్కరణ



శ్రీ భగవద్రామానుజులు

నక్కపల్లి : మండలంలోని వేంపాడులో శనివారం భగవద్రామానుజుల వారి విగ్రహావిష్కరణ ఘనంగా నిర్వహించనున్నట్టు వికాస తరంగిణి, వేంపాడు శాఖ సభ్యులు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. పద్మభూషణ్ అవార్డు గ్రహీత, పరమహంస పరివ్రాజకులు త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చినజీయర్ స్వామి చేతుల మీదుగా ఈ కార్యక్రమం జరగనుందన్నారు. భక్తులంతా హాజరై స్వామివారి మంగళాశాసనములకు పాత్రులు కాగలరని కోరారు.

అంకితభావంతో పనిచేయాలి



లాలంకోడూరు సచివాలయంలో రికార్డులు పరిశీలిస్తున్న ఎంపీడీవో కొండలరావు

రాంబిల్లి : అంకితభావంతో పనిచేస్తూ ప్రజలకు మెరుగైన సేవలందించాలని ఎంపీడీవో కె.ఎస్.కొండలరావు సచివాలయ సిబ్బందికి సూచించారు. లాలంకోడూరు సచివాలయాన్ని శుక్రవారం ఆయన సందర్శించి రికార్డులు పరిశీలించారు. అర్హులందరికీ పథకాలు అందేలా చూడాలని ఆదేశించారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రం, రైతు భరోసా కేంద్రం, విలేజ్ హెల్త్ క్లినిక్‌లను తనిఖీ చేశారు.

ఆడారి జ్యోత్స్నకు అభినందన

తుమ్మపాల : ఇటీవల కేరళలో జరిగిన ఏషియన్ పవర్ లిఫ్టింగ్ చాంపియన్‌షిప్‌లో బంగారు పతకం సాధించిన ఆడారి జ్యోత్స్నను వైఎస్సార్‌సీపీ పార్లమెంట్ పరిశీలకులు దాడి రత్నాకర్ శుక్రవారం అభినందించారు. పట్టణానికి చెందిన ఇంటర్ విద్యార్థిని జ్యోత్స్న ప్రపంచస్థాయి పోటీల్లో పతకం సాధించడంపై హర్షం వ్యక్తం చేశారు.

ప్రజలకు అండగా సీఎం జగన్

'గడప గడపకు మన ప్రభుత్వం'లో ఎమ్మెల్యే గొల్ల బాబూరావు



పి.కె.పల్లిలో స్థానికులతో ఎమ్మెల్యే బాబూరావు

కోటవురట్ల : ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్ర ప్రజలకు అండగా నిలిచారని, పేదలకు అడుగడుగునా ఆర్థిక ఆసరా కల్పించేలా సంక్షేమ పథకాలను అందిస్తున్నారని ఎమ్మెల్యే గొల్ల బాబూరావు అన్నారు. పి.కె.పల్లిలో శుక్రవారం నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి స్థానిక సమస్యలు తెలుసుకోవడంతో పాటు తక్షణ పరిష్కారానికి అధికారులకు ఆదేశాలిచ్చారు. సంక్షేమ పథకాల అమలుపై ఆరా తీస్తూ, కుటుంబాల వారీగా చేకూరిన లబ్ధిని గణాంకాలతో సహా వివరించారు. ఎక్కడైనా లోటుపాట్లు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని కోరారు. సీఎం జగన్ నేతృత్వంలోని తమ ప్రభుత్వం అర్హతే కొలమానంగా, రాజకీయాలతో పనిలేకుండా సంక్షేమ పథకాలను అందిస్తోందన్నారు. ప్రతీ కుటుంబానికి ఏదో ఒక విధంగా లబ్ధి చేకూరుతోందన్నారు. పిల్లలకు బంగారు భవిష్యత్‌ను ఇచ్చేందుకు నాడు-నేడు ద్వారా ఇంగ్లిష్ మీడియంలో నాణ్యమైన విద్య అందిస్తున్నట్టు తెలిపారు. సీఎం జగన్ ఎన్నో గొప్ప సంస్కరణలు తెచ్చి, సువర్ణపాలన అందిస్తున్నారని కొనియాడారు. చిరు వ్యాపారులు, మహిళలు, కుల వృత్తులు చేసుకునేవారిని రాష్ట్ర ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకుంటోందన్నారు. గతంలో ఏ ప్రభుత్వం చేయని విధంగా సంక్షేమాన్ని అందిస్తున్నామని ప్రజలు మరోసారి సీఎంగా జగన్‌మోహన్‌రెడ్డికి అవకాశం కల్పించాలని అభ్యర్థించారు. చంద్రబాబు మోసపూరిత వ్యాఖ్యలను, బూటకపు హామీలను నమ్మవద్దని, నమ్మిన వారిని నిలువునా ముంచేయడం చంద్రబాబు నైజమని హెచ్చరించారు. సీఎం జగన్ రాష్ట్ర ప్రజల సంక్షేమం కోసం ఎలాంటి ఆర్భాటం, పబ్లిసిటీ లేకుండా అందిస్తున్న పథకాలను ప్రజలంతా గురుపెట్టుకోవాలని కోరారు. గత ప్రభుత్వం చేసిన మోసాలను గుర్తెరిగి, రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి అత్యధిక సీట్లు అందించాలని అభ్యర్థించారు. అవ్వా-తాతలు, అమ్మా, అక్కల ఆశీస్సులు జగన్‌కు అందించాలని కోరారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల అందడంలో లోపాలుంటే తెలుసుకునేందుకే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలతో గడప గడపకు వస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి ఆర్‌ఎస్ సీతారామరాజు, సర్పంచ్ యలగడ బెన్నమ్మ, పార్టీ నాయకులు లోకవరపు బాబులు, శ్రీరామ్మూర్తి, రాజు, మాజీ సర్పంచులు కిల్లాడ శ్రీనివాసరావు, రొంగలి వెంకటరమణ, ఎంపీడీవో చంద్రశేఖర్, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

వలంటీర్ వ్యవస్థ దేశానికి ఆదర్శం



సత్కారం పొందిన వాడ్రాపల్లి వలంటీర్లు

మునగపాక : వలంటీర్లు సేవాభావంతో పని చేయాలని ఎంపీపీ మళ్ల జయలక్ష్మి కోరారు. వలంటీర్లకు వందనం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం వాడ్రాపల్లి సచివాలయం వద్ద వలంటీర్లకు అభినందన సత్కారం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన వలంటీర్ వ్యవస్థ దేశానికే ఆదర్శంగా నిలిచిందన్నారు. ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధుల్లా వలంటీర్‌లు సేవలందిస్తున్నారని కొనియాడారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందేలా చూడాలన్నారు. సర్పంచ్ కాండ్రేగుల నూకరాజు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎంపీడీవో ఈశ్వరరావు, సచివాలయ కన్వీనర్లు రామజోగినాయుడు, శీరా రమణమ్మ, జోగారావు, పంచాయతీ కార్యదర్శి శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

'ఉపాధి పథకాన్ని పటిష్టంగా అమలు చేయాలి'



ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న సోమునాయుడు

అచ్యుతాపురం(అనకాపల్లి) : జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని మరింత పటిష్టంగా అమలు చేయాలని, కూలీలకు అన్ని రకాల సదుపాయాలు కల్పించాలని సీఐటీయూ నాయకుడు కూండ్రపు సోమునాయుడు కోరారు. అచ్యుతాపురం మండలంలోని మడుతూరు, దోసూరు గ్రామాల్లో పర్యటించి గ్రామీణ ఉపాధి హామీ కూలీలతో శుక్రవారం ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా వారి సమస్యల్ని అడిగి తెలుసుకున్నారు.

దోమలతోనే వ్యాధుల వ్యాప్తి



మలేరియా మాసోత్సవాల్లో నినాదాలు చేస్తున్న ఆరోగ్య సిబ్బంది, గ్రామస్తులు

ఎస్.రాయవరం : కొరుప్రోలులో ఫైలేరియా వ్యాధిగ్రస్తులు అధికంగా ఉన్నారని వారికి సరైన చికిత్స అందించేందుకు కృషి చేస్తానని సర్పంచ్ కొరపాటి గోపాలం అన్నారు. మలేరియా మాసోత్సవాల్లో భాగంగా శుక్రవారం గ్రామంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. దోమల వ్యాప్తిని అరికడితే మలేరియా, ఫైలేరియా, డెంగ్యూ వంటి వ్యాధుల్ని నియంత్రించవచ్చన్నారు. ఇందుకు ప్రతి ఒక్కరూ బాధ్యత తీసుకోవాలని సూచించారు. ఇళ్లల్లో దోమల లార్వా వృద్ధి చెందకుండా ఎప్పటికప్పుడు నీటి నిల్వల్లేకుండా చూసుకోవాలన్నారు. ప్రతి శుక్రవారం డ్రైడే పాటించాలని సూచించారు. పంచాయితీల నుంచి వీధి కాలువలు, చెత్త కుప్పలు తొలగించేలా చర్యలు తీసుకుంటున్నట్టు పేర్కొన్నారు. కార్యక్రమంలో పెనుగొల్లు పీహెచ్‌సీ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఇంటర్లో చేరేందుకు గడువు 7



పీపీఎస్ శ్రీలక్ష్మి

మునగపాక : మండలంలోని పాటిపల్లి మోడల్ స్కూల్‌లో ఇంటర్ ప్రథమ సంవత్సరంలో చేరేందుకు ఈ నెల 7వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని ప్రిన్సిపాల్ పీపీఎస్ శ్రీలక్ష్మి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. 6వ తరగతిలో ప్రవేశాలకు ఈ నెల 11న ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్టు వెల్లడించారు. ఈ పరీక్ష స్కూల్లోనే ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 వరకు జరుగుతుందన్నారు. విద్యార్థులు హాల్‌టికెట్లను ఆన్‌లైన్‌లో డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. వివరాలకు మోడల్ స్కూల్‌ను సంప్రదించాలని కోరారు.

గాలివానతో విద్యుత్ అంతరాయం



గాలివానకు రోడ్డుపై కూలిన చెట్టు

ఎస్.రాయవరం : మండలంలో గడిచిన రాత్రి గాలితో కూడిన వర్షం కురవడంతో పలు గ్రామాల్లో విద్యుత్ అంతరాయం ఏర్పడింది. చినగుమ్ములూరు, రామయ్యపట్నం, చెల్లాపురం తదితర గ్రామాల్లో పలుమార్లు విద్యుత్ అంతరాయం ఏర్పడింది. భారీ గాలులతో కూడిన వర్షంతో చినగుమ్ములూరు, రామయ్యపట్నం గ్రామాల్లో చెట్లు విరిగి పడటంతో ఈ సమస్య తలెత్తింది. నర్సీపట్నం ఆర్ అండ్‌బీ రోడ్డుకు అనుకుని పెట్టుగోళ్లపల్లి, రామయ్యపట్నం జంక్షన్‌ల వద్ద రెండు చెట్లు రోడ్డుపై కూలి ట్రాఫిక్ సమస్య తలెత్తింది. గాలివానతో రామయ్యపట్నం, పెట్టుగోళ్లపల్లి, చినగుమ్ములూరు, ధార్లపూడి, చెల్లాపురం గ్రామాల్లో మామిడి కాయలు నేల రాలి రైతులకు నష్టం కలిగించింది.

రామన్నపాలెంలో 'గడప గడపకు' నేడు

కోటవురట్ల: రామన్నపాలెంలో శనివారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్టు వైఎస్సార్ సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి ఆర్ఎస్ సీతారామరాజు తెలిపారు. ఉదయం 6.30 గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. ఎమ్మెల్యే గొల్ల బాబూరావు ఇంటింటికీ వెళ్లి, స్థానికుల సమస్యలు తెలుసుకుని, వాటి పరిష్కారానికి కృషి చేస్తారని తెలిపారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు హాజరు కావాలని కోరారు.

నక్కపల్లి డిగ్రీ కాలేజీలో కొత్త కోర్సులు



నక్కపల్లి డిగ్రీ కళాశాల

నక్కపల్లి : వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మంజూరైన నక్కపల్లి డిగ్రీ కళాశాలలో కొత్త కోర్సుల అమలుకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని ప్రిన్సిపాల్ మల్లి శివయ్య శుక్రవారం తెలిపారు. నియోజకవర్గ ప్రజలు ఎన్నో ఏళ్లుగా ఎదురు చూసిన నక్కపల్లి డిగ్రీ కళాశాలను వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాదిలోపే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి మంజూరు చేశారు. స్థానిక ప్రజల ఆకాంక్షను తీర్చారు. తొలుత సాధారణ కోర్సులతో తరగతులు ప్రారంభించారు. తాజాగా ఈ విద్యా సంవత్సరం నుంచి కాలేజీలో సింగిల్ మేజర్ సబ్జెక్ట్‌లతో నాలుగు కొత్త కోర్సులు మంజూరయ్యాయి. గణితం కంప్యూటర్ సైన్స్, కెమిస్ట్రీ కంప్యూటర్ సైన్స్, బోటనీ కంప్యూటర్ అప్లికేషన్స్, బికాం(కంప్యూటర్స్) కాంబినేషన్లలో ఆనర్స్ డిగ్రీ కోర్సులకు కళాశాల విద్య కమిషనర్ డాక్టర్ పోలా భాస్కర్ ఉత్తర్వులు జారీ చేసినట్ట ప్రిన్సిపాల్ వెల్లడించారు. ఈ విద్యాసంవత్సరం నుంచే కొత్త కోర్సులు ప్రారంభమయ్యే అవకాశం ఉందన్నారు. జీవో ఎంఎస్ నెం.10 ద్వారా కళాశాలకు పర్మినెంట్ అధ్యాపక పోస్టులు కూడా మంజూరు చేయడంతో సిబ్బంది కొరత తీరిందన్నారు. 2023-24 విద్యా సంవత్సరంలో మొదటి సంవత్సరం డిగ్రీ అడ్మిషన్లకు కళాశాల పనివేళల్లో సంప్రదించాలని కోరారు.

ప్రమాదాల నివారణకు చర్యలు



రంబుల్ స్ట్రిప్స్ ఏర్పాటు చేస్తున్న పోలీసులు

పాయకరావుపేట: పట్టణ పరిధిలోని తాండవ జంక్షన్ వద్ద జాతీయ రహదారిపై ప్రమాదాల నివారణకు పటిష్ట చర్యలు చేపడుతున్నట్లు సీఐ పి.అప్పలరాజు శుక్రవారం మీడియాకు తెలిపారు. వేగ నియంత్రణకు రంబుల్ స్ట్రిప్స్, క్యాట్ ఐస్(రోడ్ స్టడ్స్) ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వాహన చోదకులు అతివేగాన్ని వీడి, ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు వహించాలని కోరారు.

దుర్గాదేవికి ఘనంగా పూజలు



పీఎస్‌ఆర్ పేట దుర్గాదేవి సన్నిధిలో గురు భవాని రాంబాబు, గ్రామపెద్దలు

యలమంచిలి : మండలంలోని పీఎస్‌ఆర్ పేట, పేటబయ్యవరం గ్రామాల్లోని దుర్గాదేవి ఆలయాల్లో శుక్రవారం ప్రత్యేక కుంకుమ పూజలు జరిగాయి. ఈ పూజా కార్యాక్రమాల్లో భాగంగా నక్కపల్లి మండలం ఉపమాక సీనియర్ దుర్గాభవానీ దవరసింగి రాంబాబు అమ్మవారిని దర్శించుకుని ఏకాహ భజనలో అమ్మవారి భక్తి కీర్తనలు ఆలపించారు.

ఈ సందర్భంగా ఆయనను గ్రామ సర్పంచ్ గొన్నాబత్తుల శివ, పేటబయ్యవరం సర్పంచ్ మొగలపల్లి సత్యనారాయణ, ఎడ్ల గోవిందరావు, గ్రామ పెద్దల ఆధ్వర్యంలో సన్మానించారు. అమ్మవారి ప్రసాదాలను అందించారు. చుట్టుపక్కల గ్రామాల మహిళలు అధిక సంఖ్యలో తరలివచ్చి పసుపు, కుంకుమలతో అమ్మవారికి పూజలు నిర్వహించారు. ఆలయానికి వచ్చిన భక్తులకు కమిటీ సభ్యులు ప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మొగ్గా గోవిందరావు, జెర్రిపోతుల వెంకట్, మొగ్గా బుజ్జి, జెర్రిపోతుల నానాజీ, రాయవరపు వెంకట్ మొల్లి అప్పారావు, కలిగట్ల నానాజీ తదితరులు పాల్గొన్నారు.

సురక్ష బీమా యోజనపై అవగాహన నేడు

కశింకోట : మండలంలోని నూతలగుంటపాలెంలో శనివారం ఉదయం 11 గంటలకు సురక్ష బీమా యోజనపై అవగాహన కార్యక్రమం నిర్వహించనున్నట్టు యలమంచిలి ఎస్‌బీఐ శాఖ మేనేజర్ జి.రవి కుమార్, ఫీల్డ్ అధికారి వందన తెలిపారు.

ట్రాక్టర్లు, వ్యవసాయ పనిముట్ల పంపిణీ



ట్రాక్టర్ల పంపిణీలో ఏవో స్వప్న

కశింకోట : మండలంలోని 11 గ్రామాలకు చెందిన కస్టం హైరింగ్ కేంద్రాల ద్వారా వైఎస్సార్ యంత్ర సేవా పథకం కింద రూ.82.50 లక్షల విలువైన ట్రాక్టర్లు, పనిముట్లను పంపిణీ చేసినట్లు మండల వ్యవసాయ అధికారి స్వప్న తెలిపారు. అనకాపల్లిలో జరిగిన కార్యక్రమంలో శుక్రవారం వీటిని అందించారు. కశింకోట, కొత్తపల్లి, వెదురుపర్తి, ఏఎస్ పేట, చింతలపాలెం, అచ్చెర్ల, జి.భీమవరం, తేగాడ రైతు భరోసా కేంద్రాల పరిధిలో కస్టం హైరింగ్ కేంద్రాలకు ఒక్కొక్కటి చొప్పున మొత్తం 8 ట్రాక్టర్లను పంపిణీ చేశారు. ట్రాక్టర్ కంపెనీల మేరకు వీటిని రూ.2 లక్షల నుంచి రూ.4 లక్షల పైబడి రాయితీపై రైతులకు అందించారు. ఈ ట్రాక్టర్లను తాము వినియోగించడంతోపాటు వ్యవసాయ అవసరాలకు కావలసిన రైతులకు కూడా అద్దె ప్రాతిపదికన కస్టం హైరింగ్ కేంద్రాల నిర్వాహకులు సమకూర్చాల్సి ఉంటుందని వ్యవసాయాధికారి పేర్కొన్నారు. రొటావేటర్లు, దమ్ము, దుక్కి నాగళ్ల సెట్లు, పవర్ వీడర్లు కూడా 40 శాతం రాయితీపై అందించామన్నారు. ఆయా రైతు భరోసా కేంద్రాలతోపాటు తాళ్లపాలెం, జమాదులపాలెం కేంద్రాల పరిధిలో వీటిని అందించినట్టు వెల్లడించారు.

అంకితభావంతో పనిచేసే ఉద్యోగులకు గుర్తింపు



ఎంపీడీవో రవికుమార్‌ను సత్కరిస్తున్న సిరసపల్లి సర్పంచ్ ధనలక్ష్మి

మునగపాక : అంకితభావంతో పనిచేసే ఉద్యోగులకు సమాజంలో తగిన గుర్తింపు ఉంటుందని టి.సిరసపల్లి సర్పంచ్ మద్దాల ధనలక్ష్మి అన్నారు. మునగపాక మండల పరిపాలనాధికారిగా విధులు నిర్వహిస్తూ విజయనగరం జిల్లా బొబ్బిలి ఎంపీడీవోగా పదోన్నతి పొందిన రవికుమార్‌ను శుక్రవారం సాయంత్రం సచివాలయంలో సత్కరించారు. ఈ సందర్భంగా ధనలక్ష్మి మాట్లాడుతూ ఉద్యోగులకు బదిలీలు సర్వసాధారణమని, అయితే పనిచేసే సమయంలో సక్రమంగా విధులు నిర్వహించిన వారు గుర్తింపు దక్కించుకుంటారన్నారు. మండల అభివృద్ధికి రవికుమార్ అందించిన సేవల్ని కొనియాడారు. కార్యక్రమంలో సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.

ఉపాధి పనుల్లో జాగ్రత్తలు తీసుకోండి



పాములవాకలో ఉపాధి కూలీలతో ముచ్చటిస్తున్న ఎమ్మెల్యే బాబూరావు

కోటవురట్ల : చెల్లెమ్మా ఎండలో పనిచేసేటపుడు జాగ్రత్తగా ఉండండి. ఎక్కువగా మంచినీళ్లు తాగండి. వడదెబ్బ తగలకుండా అప్రమత్తంగా ఉండండి.. అంటూ ఎమ్మెల్యే గొల్ల బాబూరావు ఉపాధి కూలీలకు సూచనలు చేశారు. పాములవాకలో జరుగుతున్న ఉపాధి పనులను ఆయన శుక్రవారం పరిశీలించారు. పని ప్రదేశంలో ఉపాధి కూలీలను కలుసుకుని వారి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను పేద కుటుంబం నుంచే వచ్చానని, ఆ కష్టం తనకు తెలుసన్నారు. మీరు పడే కష్టం మీ పిల్లలకు రానీయకుండా వారికి మంచి చదువును అందివ్వాలన్నారు. పిల్లలకు మంచి విద్యను అందించేందుకు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అనేక సంస్కరణలు చేసినట్టు తెలిపారు. నాడు-నేడు ద్వారా పాఠశాలను అభివృద్ధి చేసి మెరుగైన విద్యను అందిస్తున్నారన్నారు. ఉపాధి పనులను తెల్లవారు జామునే ప్రారంభించి ఎండ తగలక ముందే ముగించాలని సూచించారు. పని ప్రదేశాలలో మంచినీళ్లు, ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని, టెంట్లు వేయాలని ఏపీవో గంగునాయుడును ఆదేశించారు. ఎమ్మెల్యే వెంట వైఎస్సార్ సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి ఆర్‌ఎస్ సీతారామరాజు, మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ కిల్లాడ శ్రీనివాసరావు ఉన్నారు.

విద్యార్థులు ఉత్తమ పౌరులుగా ఎదగాలి



విద్యార్థి గోళ్ల ధాత్రిని అభినందిస్తున్న నాయకులు

పాయకరావుపేట : విద్యార్థులు ఉత్తమ పౌరులుగా ఎదగాలని, ఆసక్తి గల రంగంలో మంచి ప్రావీణ్యత సాధించాలని హైకోర్టు న్యాయవాది వంకా నారాయణరావు అభిలషించారు. పదో తరగతి ఫలితాల్లో 588 మార్కులు సాధించిన పాయకరావుపేటకు చెందిన గోళ్ల నారాయణస్వామి కుమార్తె ధాత్రిని స్థానిక గ్రంథాలయంలో నాయకులు శుక్రవారం అభినందించారు. జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ తోట నగేష్ ఆధ్వర్యంలో పార్టీలకు అతీతంగా పట్టణంలోని నాయకులు ధాత్రిని సత్కరించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు ధనిశెట్టి బాబూరావు, టీడీపీ మండల అధ్యక్షుడు పెదిరెడ్డి చిట్టిబాబు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి, కాపునాడు రాష్ట్ర ఉపాధ్యక్షుడు జగతా శ్రీను, పంచాయతీ ఉప సర్పంచ్ జగతా భవానీ శ్రీనివాస్, పాండురంగ దేవస్థానం మాజీ చైర్మన్ యాళ్ల వరహాలు, వ్యాపారవేత్త కంభంపాటి వెంకటరమణ, సిద్ధార్థ స్కూల్ ప్రిన్సిపాల్ నాగబాబు, దొర తదితరులు పాల్గొన్నారు.

ఏకాగ్రత, చిత్తశుద్ధితో ఉజ్వల భవిత



పదిలో మెరిట్ సాధించిన విద్యార్థులకు మెమెంటో, ప్రశంసా పత్రాలిచ్చిన ట్రస్ట్ ప్రతినిధులు

మునగపాక : విద్యార్థులు తమ లక్ష్య సాధనకు చిత్తశుద్ధితో చదవడం ద్వారా ఉజ్వల భవిష్యత్ సొంతమవుతుందని ఎంఈవో వేణుగోపాలరావు అన్నారు. మండలంలోని టి.సిరసపల్లిలో కల్వరి విమోచన మినిస్ట్రీస్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శుక్రవారం ఇటీవల పదో తరగతి ఫలితాల్లో మెరిట్ సాధించిన 30 మంది విద్యార్థులకు శుక్రవారం గోల్డ్‌మెడల్, సర్టిఫికెట్, డిక్షనరీ, జ్ఞాపిక అందించారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ చదువులో ఏకాగ్రత ఎంతో అవసరమన్నారు. టెన్త్‌లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులు మరింత పట్టుదలతో చదివి, ఉన్నత స్థానాలను అధిరోహించాలని అభిలషించారు. విద్యార్థులను ప్రోత్సహించేందుకు ముందుకు వచ్చిన ట్రస్ట్ చైర్మన్ కుటుంబరావును అభినందించారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులతో పాటు పలు జిల్లా పరిషత్ హైస్కూళ్ల హెచ్‌ఎంలు పాల్గొన్నారు.

అనాథ శవానికి అంత్యక్రియలు

మానవత్వం చాటుకున్న మునగపాక సర్పంచ్ అప్పారావు



అనాథ శవానికి పాడె మోస్తున్న సర్పంచ్ అప్పారావు

మునగపాక : మునగపాక సర్పంచ్ దిమ్మల అప్పారావు మానవత్వం చాటుకున్నారు. పక్కోడు ఏమైపోతే మనకెందుకనుకునే రోజుల్లో అనాథ శవానికి అంతా తానై అంత్యక్రియలు నిర్వహించారు. మునగపాకకు చెందిన బొడ్డు అప్పలకొండ(బద్రీ) గత కొన్నేళ్లుగా ఒంటరిగా జీవనం సాగిస్తున్నాడు. తల్లితండ్రులు, ఇళ్లు లేకపోవడంతో దేవాలయాలు, ధర్మసత్రాల్లో తలదాచుకునేవాడు. ప్లాస్టిక్ బాటిళ్లు, కార్డ్‌బోర్డ్ తదితర వస్తువులను ఏరుకుని, వాటిని విక్రయిస్తూ జీవనం సాగిస్తున్నాడు. అలాంటి వ్యక్తి శుక్రవారం మునగపాక నందీశ్వర ప్రాంగణం దరి మృతి చెంది ఉండడాన్ని స్థానికులు గమనించారు. అనాథ అయిన అప్పలకొండకు అంత్యక్రియలు నిర్వహించేందుకు ఎవరూ ముందుకు రాలేదు. దీంతో స్పందించిన సర్పంచ్ దిమ్మల అప్పారావు స్థానికంగా ఉన్న నలుగురిని పిలిచి, అప్పలకొండ పాడె మోసి అంత్యక్రియలు నిర్వహించారు. దీనికైన ఖర్చు ఆయనే భరించారు.

ఒంపోలులో ఉచిత పశువైద్య శిబిరం



ఒంపోలులో పశువైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న పశు సంవర్ధకశాఖ జిల్లా అధికారి ప్రసాదరావు

మునగపాక : మండలంలోని ఒంపోలులో శుక్రవారం ఏర్పాటు చేసిన ఉచిత పశు వైద్య శిబిరానికి రైతుల నుంచి విశేష స్పందన లభించింది. రిలయన్స్ ఫౌండేషన్ సౌజన్యంతో ఏర్పాటు చేసిన శిబిరాన్ని పశు సంవర్ధక శాఖ జిల్లా అధికారి బెహరా ప్రసాదరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మేలుజాతి పశువులను కొనుగోలు చేయడం ద్వారా రైతులకు మంచి ఆదాయం సమకూరుతుందన్నారు. పశువులకు దాణా విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వైఎస్సార్ పశు పోషణ పథకాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. శిబిరంలో 55 పశువులకు గర్భకోశ పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందించారు. శిబిరానికి నాగులాపల్లి పశువైద్యాధికారి జె.పద్మజ, శస్త్ర చికిత్స నిపుణులు పి.బానుబాబులు హాజరై, సేవలందించారు. కార్యక్రమంలో రిలయన్స్ ఫౌండేషన్ జిల్లా ప్రతినిధి తిరుమలరావు, పశు సంవర్ధక శాఖ సహాయకులు జ్యోత్స్న, గోపాలమిత్ర ఆర్‌డీఎస్ అప్పారావు, రైతులు పాల్గొన్నారు.

వాతావరణ మార్పులతో ఆరోగ్యంపై అప్రమత్తం



తోటాడలో ఫ్యామిలీ డాక్టర్ సేవలందిస్తున్న అనిల్‌కుమార్

మునగపాక : వాతావరణంలో వస్తున్న మార్పుల కారణంగా తలెత్తే ఆరోగ్య సమస్యలపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని మునగపాక పీహెచ్‌సీ వైద్యాధికారి అనిల్‌కుమార్ తెలిపారు. మండలంలోని తోటాడ ఆరోగ్య ఉప కేంద్రంలో శుక్రవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో భాగంగా ఆయన స్థానికులకు వైద్య సేవలందించారు. ఈ సందర్భంగా అనిల్‌కుమార్ మాట్లాడుతూ పెరుగుతున్న ఉష్ణోగ్రతల దృష్ట్యా ప్రజలు ఆరోగ్య జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వేసవి తీవ్రత వల్ల వచ్చే సమస్యల్ని ఎదుర్కొనేందుకు వైద్యుల సలహాలు, సూచనలు పాటించాలన్నారు. కార్యక్రమంలో తోటాడ సర్పంచ్ మంగవేణి భర్త కోటేశ్వరరావు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.